# పారాహుషార్

జనవరి నెల. రాత్రి రెండు కావస్తోంది. చలిగాలి బాగా వీస్తోంది. ప్రకృతి తెల్లని మేలిముసుగుతో సింగారించుకున్నట్లుగా పొగమంచు దట్టంగా అలుముకుంది. వీధులు దాదాపు నిర్మానుష్యంగా వున్నాయి. ఊరకుక్కలు చలిబాధకు ఉండుండి 'కుయ్ కుయ్' మంటున్నాయి.



'టిక్ టిక్' మంటూ వినిపిస్తున్న లయబద్ధమైన శబ్దాన్ని పసిగడుతూనే కుక్కలు పొట్టలో దాచుకున్న తలలు బయటకు లాగి నిగిడించి చూస్తున్నాయి.

సందు మలుపు తిరిగిన బాదురి కంటబడుతూనే కుక్కలు గగ్గోలుగా లేచేయి. అతను వాటి గోలను ఏమాత్రం ఖాతరు చెయ్యకుండా తనపని తాను చేసుకుపోతున్నాడు.

ఒక్కో ఇంటి గుమ్మంముందు ఆగి, తన ఉనికి తెలియపరచదాని కన్నట్లు మెట్లమీదనో, గోడమీదనో, గేటు మీదనో లాఠీని టకటక లాడిస్తున్నాడు. విశాలంగా వున్న ఇళ్ల కాంపౌండ్లను బ్యాటరీ వెలుగులో గుచ్చి గుచ్చి చూస్తున్నాడు.

కుక్కలు మరీ మీద కొచ్చినప్పుడు చిరాగ్గా "చుప్ చుప్.... జావ్...జావ్" అంటూ లాఠీతో అదిలిస్తున్నాడు.

వీధిలో అలజడికి మెలకువ వచ్చినవాళ్లు చిరపరిచితమైన లాఠీశబ్దం, బాదురి గొంతు వినబడుతూనే, 'గూర్ఖా వచ్చినట్లున్నాడు కాబోలు' అనుకుంటూ ప్రశాంతంగా నిద్రలోకి జారుతున్నారు.

తలమీద గుడ్డటోపి, మెడకు చుట్టుకున్న మఫ్లరు, వంటిమీదున్న మందపాటి దుస్తులు, వులెన్ స్వెట్టర్ అతనికి చలిబాధ లేకుండా చాలవరకు కాచుకుంటున్నాయి. నడుముకు చుట్టుకున్న బెల్టుకు వేలాడుతున్న ఒరలోని పొడవైన కత్తిపిడి వెలుతురులో మెరుస్తోంది.

సుమారు అయిదున్నర అడుగుల ఎత్తు, యాభై సంవత్సరాల వయస్సు పైబడినప్పటికీ వ్యాయామంతో దేహం కండలు తిరిగి నలభై సంవత్సరాలవాడిలా దృఢంగా కనిపిస్తాడు.

అనుమానాస్పదమైన ప్రతి కదలికనీ తన డేగలాంటి కళ్లతో నిశితంగా పరిశీలిస్తూ గస్తీ తిరుగుతుంటాడు. అంత రాత్రివేళల్లో మారుమూల చీకటి సందుల్లో ఒంటరిగా తిరుగుతున్నా భయమన్నది అతని మనస్సును తాకనే తాకదు. ఊహించని విపత్తు ముంచుకొచ్చినా ముందు వెనుకలు ఆలోచించకుండా తలపడటానికి సదా సిద్ధంగా వుంటాడు.

గస్తీ తిరుగుతున్న బాదురికి నలుగురు మనుషులు తారసపడ్డారు. ఆ సందులో వీధిలైట్లు లేకపోవటంతో వెలుతురు తక్కువగా వుంది.

బ్యాటరీలైటు వాళ్లమీదకు ఫోకస్ చేస్తూ, "కౌన్ హై సాబ్..." అన్నాడు.

నలుగురూ నిలబడ్డారు. కాస్త దగ్గరగా వెళ్లాడు.

"బోలో సాబ్.... ఆప్ కహాఁసే ఆ రహేహూ" ఈసారి గొంతు కొంచెం దృఢంగా పలికింది.

"స్టూడెంట్సం. సెకండ్‌షో సినిమాకి వెళ్లి కబుర్లాడుకుంటూ వస్తున్నాం" చెప్పాడొకతను.

"అచ్చా... బిల్ కుల్ ఠండీ హై. జల్దీ ఘర్ జాయియే" అన్నాడు బాదురి.

వాళ్లు ముందుకు నడిచారు. చెప్పింది నిజమేనన్న నమ్మకం కలిగింది. వేళగాని వేళలో తారసపడ్డ ప్రతి మనిషినీ పలకరింపుగా మాట్లాడిస్తున్నట్లే జాగ్రత్తగా పరిశీలిస్తుంటాడు.

మూడు కావస్తున్నది. రాత్రి మొత్తం మీద మూడుసార్లు తిరుగుతాడు.

చలిగాలి మరికాస్త పెరిగింది. వంటిమీదున్న దుస్తులు మంచు పీల్చుకుని కాస్త మెత్తబడటంతో వంట్లోకి చల్లదనం చొరబడినట్లయింది. బీడీ తీసి వెలిగించుకున్నాడు. కాలనీ మెయిన్‌రోడ్ మీదున్న షాపింగ్ కాంప్లెక్స్‌కేసి నడిచాడు.

ఆ కాంప్లెక్స్‌లో మొత్తం పది దుకాణాలున్నాయి. తలో అయిదు చొప్పున నికరంగా నెలకు యాభై రూపాయలు. అవేకాక కాలనీలో మరో పది దుకాణాలు కూడా చూస్తుంటాడు. దుకాణాలముందు ఆ మూలొకరు, ఈ మూలొకరు ఇద్దరు మనుషులు పడుకుని వున్నారు. వాళ్లమీద లైటు ఫోకస్ చేశాడు. పక్కనున్న జోలె, మూటలు చూసి బిచ్చగాళ్లని గ్రహించాడు.

నింపాదిగా కాంప్లెక్స్ అరుగుమీద కూర్చుని మరో బీడీ వెలిగించుకున్నాడు. రోడ్డు మీద రిక్షా ఒకటి మెల్లగా పోతున్నది. దాని ఇరుసుకు బిగించిన రేకుబిళ్లల గలగలల శబ్దం నిశ్శబ్దంలో సంగీతంలా ధ్వనిస్తూ క్రమేణా దూరమైంది. సైకిళ్లమీద కబుర్లాడుకుంటూ వెళ్తున్న నైట్‌డ్యూటీ కానిస్టేబుల్స్‌ను చూస్తూనే బాదురి "సలామ్ సాబ్" అన్నాడు. వాళ్లు ప్రతిగా చేతులూపుతూ వెళ్లారు.

కొద్దిసేపు అక్కడే కూర్చున్నాడు. టైం చూసుకున్నాడు. 'సాడెతీన్' మనస్సులో అనుకుంటూ తిరిగి కాలనీలోకి దారితీశాడు.

రోడ్డుమీద టకటక లాడుతున్న లాఠీశబ్దం ఒక్కో వీధిలో ప్రతిధ్వనించ సాగింది. చకచకా ఒక గంటలో వీధులన్నీ తిరిగాడు. అయిదు గంటలకల్లా కాలనీలోని ఒక్కో ఇంట్లో సందడి మొదలైంది.

రిక్షాలవాళ్లు బాడుగల కోసం రోడ్లమీద కొస్తున్నారు. పాల ప్యాకెట్లమ్ముకునే వాళ్లు, పేపర్ కుర్రాళ్లు సైకిల్ బెల్లులు గణగణలాడించుకుంటూ చురుగ్గా దూసుకెళ్తున్నారు. తోపుడు బళ్లవాళ్లు సరుకుల కోసం మార్కెట్ కేసి బళ్లను దౌడు తీయిస్తున్నారు. పట్టణం నిద్రమత్తు వదిలించుకుని చైతన్యవంతమైంది.

బాదురి ఇల్లు చేరేసరికి తెల్లవారింది. దారిలో పాలప్యాకెట్లు కొన్నాడు. కొడుకు అప్పటికే నిద్రలేచి కసరత్తు చేస్తున్నాడు. బాదురి కాలకృత్యాలు ముగించుకుని కసరత్తు పూర్తి చేసేసరికి కొడుకు వేడిగా చాయ్ తండ్రికి అందించాడు.

* * *

ఫిబ్రవరి నెల మొదటివారం. ఉదయం ఎనిమిది దాటింది. బాదురి కాలనీలో హడావుడిగా తిరుగుతున్నాడు.

ఒక ఇంటివాకిలి ముందు నిలబడ్డాడు. తలుపు వారగా వేసివుంది. లాఠీతో గడపముందు శబ్దం చేసాడు. తలుపు తెరుచుకుంది.

"సలామ్ మేమ్‌సాబ్.... పైసలిప్పించండి" వినయంగా అడిగాడు.

"అయ్యగారు ఊరెళ్లారు. రెండ్రోజులాగి కనిపించు".

"అచ్చీబాత్ హై" అంటూ వెనుదిరిగాడు.

ఆ ఇంటి యజమాని ముందు రోజున్నాడు. చిల్లరలేదని ఈ రోజుకు వాయిదా వేసేడు. ఈ రోజు వస్తే ఊళ్లోలేడు. అలా ఒకటికి పదిసార్లు తిరగాల్సి వచ్చినా బాదురికి విసుగనిపించదు. ఇచ్చినా, ఇవ్వకున్నా నవ్వు ముఖంతో ఒక్కో గడప ఎక్కి దిగుతుంటాడు.

మరో ఇంటికి వెళ్లాడు. "సలామ్ సాబ్..." అన్నాడు ఆ ఇంటి యజమానిని చూస్తూనే.

"సరిగ్గా వస్తున్నావా?"

"జీ సాబ్....మరీ భుకార్‌గుంటే తప్ప వస్తూనేవుంటా సార్" వినమ్రంగా చెప్పాడు.

అతను సంతృప్తికరంగా తలూపి రెండు రూపాయలు ఇచ్చాడు. బాదురి సెల్యూట్ చేసి ముందుకు సాగి మరో వీధిలోకి అడుగుపెట్టాడు.

"సలామ్.... పైసలిస్తారా సాబ్".

"నీకు ఎందుకు ఇవ్వాలి?" ఎదురుప్రశ్న వేసేడు ఆ ఇంటతను.

ఆ ప్రశ్నకు అప్రతిభుడయ్యాడు. ఇష్టముంటే ఇస్తారు. లేకుంటే లేదంటారు. అంతేగాని ఇంత పెడసరంగా మాట్లాడటం బాదురి ఎరగడు.

మెడికల్ అండ్ హెల్త్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తుంటాడు వీరభద్రం. నెలరోజుల క్రితమే మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ మీద ఆ ఊరొచ్చాడు.

"గూర్ఖాని సాబ్! కాలనీలో గస్తీ తిరుగుతుంటా. నెలకింతని తోచింది ఇస్తుంటారు" అన్నాడు ఎంతో వినయంగా.

"అందరూ ఇవ్వాలని రూలేమన్నా వుందా?" వెటకారంగా అన్నాడు.

"రూలేముంది సాబ్! ఆప్‌కి మెహర్బాని. ఇస్‌సే హమారా పేట్ భరతాహై".

"దొంగల్ని పట్టుకోవటం పోలీస్ డిపార్టుమెంటుకే చేతకావటం లేదు. ఒక్కడివి, నీ వల్లవుతుందా?" ఎద్దేవగా అన్నాడు.

బాదురి మనస్సు చివుక్కుమన్నది. తన వృత్తిధర్మాన్ని తేలిక పరుస్తున్నట్లుగా చిన్నబుచ్చుకున్నాడు.

"తెలిసీ దొంగతనం జరగనిస్తామా సాబ్?" అన్నాడు ఆత్మవిశ్వాసంతో.

"ఈ కబుర్లకేంలే, జావ్...మళ్లీ డబ్బుకోసం మా ఇంటికి రావద్దు" అంటూ నిక్కచ్చిగా చెప్పి లోనికి వెళ్లాడు వీరభద్రం.

అతను డబ్బు లివ్వనన్నందుకు బాదురి నొచ్చుకోలేదు. కించపరుస్తున్నట్లుగా అతను అన్నమాటలే మనస్సును ముల్లుపోటులా బాధించాయి.

గూర్ఖాగా అతనికి ముప్పైయ్యేళ్ల పైబడిన అనుభవం ఉంది. పొట్ట గడవాలన్న ప్రాథమిక అవసరాన్ని మించి డబ్బు కోసం వెంపర్లాడటం అతనికి తెలీదు.

మనుషులు అందరూ ఒకే రకంగా ప్రవర్తించరని బాదురికి తెలుసు. సంతోషం కొద్దీ ఇచ్చేవాళ్లు కొందరైతే, దయతో ఇచ్చేవాళ్లు మరికొందరు. లేవని మొండిచేయి చూపేవాళ్లూ వుంటారు.

పొట్టగడవటానికి పరాయి దేశానికొచ్చి, పదిమంది దయమీద బతుకుతున్నానన్న కృతజ్ఞత ఒక్కటే అతనికి తన కర్తవ్యంపట్ల గౌరవాన్ని పెంచింది. రెండు రూపాయలిచ్చినా, అయిదు రూపాయలిచ్చినా, అసలు ఇవ్వకున్నా అందరికీ ఒకేరకంగా 'సలామ్' కొడ్తాడు. విధినిర్వహణ పట్ల అతనికెలాంటి పంతాలు, పట్టింపులు, ఉక్రోషాలు వుండవు.

ఇరవయ్యేళ్ల వయస్సుకే స్వదేశమైన నేపాల్ వదిలి వచ్చాడు. దబలాగిరి రాష్ట్రంలోని బాగులుం జిల్లాలో ఒకపల్లె బాదురి పుట్టిన ఊరు. బాదురికి నలుగురు అన్నలు, ఇద్దరు అక్కలు. అందరికన్నా చిన్నవాడు బాదురి. ఆ కుటుంబానికి జీవనాధారం కొద్దిపాటి వ్యవసాయ భూమి. కొండప్రాంతపు సాగు. పండే కొద్దిపాటి పంటమీద అందరూ బ్రతకటం కష్టమైంది.

పొట్ట చేతబట్టుకుని అన్నలిద్దరు మహారాష్ట్ర చేరారు. ఆ తరువాత కొంతకాలానికి బాదురి తెలుగుదేశానికొచ్చాడు. జీవనాధారంగా ఈ వృత్తిని వెదుక్కున్నాడు. అయిదారు పెద్ద పట్టణాల్లో వుంటూ వచ్చాడు. వచ్చిన కొత్తలో ఇంటికి పావలానో, అర్థో ఇచ్చేవారు. వందరూపాయల్లో పొట్ట గడుపుకునేవాడు. మిగిలిన పదో, పరకో దాచి పెట్టేవాడు. రెండేళ్లకో, మూడేళ్లకో తన దేశంపోయి, ఆ డబ్బు తల్లిదండ్రులకు ఇస్తుండేవాడు. అన్నలూ బాదురిలానే కుటుంబాన్ని ఆదుకుంటుండేవారు.

కొడుకుల సాయంతో తల్లిదండ్రులు ఆడపిల్లల పెళ్లిళ్లు చేశారు. ఆ తర్వాత అన్నల పెళ్లిళ్లు అయ్యాయి. బాదురి పెళ్లినాటికి మూడుపదుల వయస్సు దాటింది. భార్యను కాపురానికి తెచ్చుకున్నాడు.

ఒక కొడుకూ, కూతురు కలిగారు. కుటుంబ ఖర్చులు పెరిగాయి. ఆదాయం అంతంత మాత్రమే. పిల్లలు తినగా మిగిలితే భార్యాభర్తలు తినేవారు. లేకుంటే అదీ లేదు.

బాదురి తల్లిదండ్రులు చనిపోయారన్న వార్త మాత్రం అన్నల ద్వారా తెలిసింది. చివరిక్షణాల్లో తననూ, పిల్లల్నీ చూడాలని వారుపడ్డ తపన గురించి అన్నలు చెప్పినప్పుడు, వెళ్లలేకపోయిన తన దుస్థితికి లోలోన కుమిలిపోయాడు. డబ్బు ఇబ్బందుల వలన పెళ్లయి బిడ్డలు పుట్టిన తరువాత ఇంతవరకు బాదురి తన దేశం వెళ్లలేక పోయాడు. పిల్లలు పెద్దవాళ్లయినారు.

నాలుగేళ్ల క్రితం భార్య క్యాన్సర్ వ్యాధికి గురయింది.

నెలరోజులకు మించి బ్రతకదని డాక్టర్ చెప్పాడు. తన పరిస్థితిని ఆమె గ్రహించింది.

"నే నెలాగూ బ్రతకను. నా వాళ్లందరూ గుర్తొస్తున్నారు. నేను పుట్టిన ఊరు, అక్కడున్న చెట్లు, గుట్టలు, కొండలు చూడాలనిపిస్తున్నది. అక్కడే చనిపోతే బాగుండును" అన్నది బాదురి భార్య దీనంగా.

తనను పెళ్లాడింది. తనకోసం దేశం వదిలింది. ఎంతోకాలం కాపురం చేసింది. కష్టమో, నష్టమో కలిసి పంచుకున్నది. ఇది లేదని గాని అవి కావాలనిగాని కోరి ఎరుగదు. వేళకింత తిండి తప్పితే ఆమె తననుండి పొందగలిగింది ఏమున్నది? ఇన్నేళ్లకు ఒకేఒక్క కోరిక చనిపోతూ కోరింది.

కొద్దో గొప్పో మిగిలిన డబ్బు కాస్తా ఆమె వైద్యానికి హరించుకు పోయింది. తన దేశం వెళ్లాలంటే చాల డబ్బు కావాలి. ఎక్కడినుండి వస్తుంది? రోజూ లోలోన కుమిలి పోయేవాడు.

"నీ కోరిక తీర్చలేకపోతున్నాను. మన పరిస్థితి నీకు తెలియంది కాదు" భార్య అంతిమ గడియల్లో కన్నీరు పెట్టుకున్నాడు.

"బాధపడొద్దు. నేను చచ్చిపోయాక మీరెప్పుడైనా మన దేశం వెళ్తారుకదా! అప్పుడు నా అస్థికల్ని తీసుకెళ్లి అక్కడి మట్టిలో కలపండి" చెప్పింది ఎగశ్వాసతో.

"తప్పకుండా అలాగే చేస్తాను. నీ కోరిక తీరుస్తాను" చెప్పాడు బాదురి.

అతని చేతుల్లోనే ఆమె ప్రాణాలు విడిచింది. నిజానికి బాదురి ఆ దిగులునుండి ఎప్పటికీ కోలుకోలేదు.

భార్యపోయిన రెండేళ్లకు, విశాఖపట్టణంలో గూర్ఖాగా చేస్తున్న ఒక అయ్యచేతిలో కూతుర్ని పెట్టి గుండె మీద బరువు దించుకున్నాడు. కొడుకూ, తనూ చిన్న పెంకుటింటి పోర్షన్‌లో తలదాచుకుంటున్నారు.

కాలనీలో వుంటున్న ఒక దొరబాబును బతిమాలుకుని కొడుక్కి పొగాకు కంపెనీలో చౌకీదారు ఉద్యోగం వేయించుకున్నాడు. పెళ్లి చేసి ఒక ఇంటివాణ్ణి చేస్తే ఆదదిక్కు వుంటుందన్న ఆలోచన ఇప్పుడిప్పుడే కలగసాగింది.

ముప్ఫైయ్యేళ్లు పైబడి చేసిన వృత్తిలో అతను తనకంటూ సంపాదించి దాచుకున్నది ఏమీలేదు. కుటుంబ అవసరాలకు మించి ఆదాయం వచ్చిందీ లేదు. తన సేవకు అంతకుమించిన ప్రతిఫలం కూడా అతను ఆశించినట్లు కనపడదు.

తన సంపాదనే ఇంతకాలం కుటుంబానికి ఆధారమైంది. ఇప్పుడు కొడుకూ సంపాదనపరుడైనాడు. నాలుగేళ్లపాటు ఇక్కడే వుండి నాలుగురాళ్లు వెనకేసుకుని స్వదేశం పోవాలనీ, భార్యకిచ్చినమాట నిలుపుకోవాలనీ, పుట్టిన గడ్డమీదనే తనూ మట్టవ్వాలనీ బాదురి ఉద్దేశ పడసాగాడు. వయస్సు మళ్లుతున్నకొద్దీ తన దేశం మీద, మనుషులమీద మమకారాలు హెచ్చసాగాయి.

బాదురి ఉదయం పదిగంటలదాకా డబ్బు వసూలు చేసుకున్నాడు. ఆ నెలకుగాను ఆదాయం ఏడువందలు దాటింది. అది నెల నెలా స్థిరంగా వుండదు. ఒకనెల కొందరు అదిగో ఇదిగో అంటూ వాయిదావేసి నెలదాటిస్తారు. క్రిందటినెల ఇవ్వలేదని అతనూ అనలేదు, గుర్తుంచుకుని వాళ్లూ ఇవ్వరు.

ఇంటికి వెళుతూనే ఉదయం వుడకేసుకున్నది తిని మేను వాల్చాడు. వెంటనే గాఢంగా నిద్రపట్టింది. చీకటిపడే సమయానికి తిరిగి నిద్రలేస్తాడు. స్నానంచేసి వంటపని పూర్తిచేస్తాడు. కొడుకు డ్యూటీ నుండి వచ్చేసరికి రాత్రి తొమ్మిదవుతుంది. అతనితోపాటు తనూ తిని గస్తీకి బయల్దేరతాడు.

* * *

రాత్రి రెండుగంటలు దాటింది. బాదురి రోడ్డుమీద లాఠీకర్ర తాటిస్తూ నింపాదిగా నడుస్తున్నాడు. వీధికుక్కలు మొరుగుతూ గోల చేస్తున్నాయి. ఆ గోలను లక్ష్య పెట్టకుండానే సునిశిత దృష్టితో ముందుకు సాగిపోతున్నాడు.

వీరభద్రం వుంటున్న వీధిలోకి వచ్చాడు. రెండు రోజులుగా ఆ ఇంటికి తాళంవేసి వుంటోంది. ఊరెళ్లి వుంటారనుకున్నాడు. అందుకే ఆ ఇంటిమీద కాస్త నిఘా వుంచాడు. ఆ ఇంటతను తనకు డబ్బులివ్వలేదనిగాని, అవమానకరంగా మాట్లాడేడనిగాని బాదురి ఆలోచించటం లేదు. ఆ ఇంటివాళ్లు ఊరిలో లేరు గనుక తగుజాగ్రత్తలో వుండటం తన విధి అనుకున్నాడు.

కాంపౌండ్‌వాల్ గేటుకున్న తాళంకప్ప కాంతిలో మెరుస్తున్నది. వాకిలి తలుపులుకేసి బ్యాటరీలైటు ఫోకస్ చేశాడు. తాళంకప్ప కనపడటంలేదు. తలుపు దగ్గరగా చేరవేసినట్లుంది.

ఆ క్షణంలోనే మనస్సు తార్కికంగా ఆలోచించటం మొదలుపెట్టింది. ఇంటివాళ్లు వచ్చివుంటే గేటుకు తాళం ఎందుకు వుంటుంది? లోపల తాళం లేకుండా, గేటుకు తాళం వుండటం ఎలా సంభవం? మనస్సులో అనుమానం తలెత్తింది.

గేటు దగ్గరకు వెళ్లాడు. కాంపౌండ్ నలుమూలలకు లైటు ఫోకస్ చేశాడు. ఒకమూల గోడ ప్రక్కకు వదిగి ఇద్దరు మనుషులు పొంచి ఉన్నారు. వెలుగు తమ మీద పడటంతో వాళ్లిద్దరూ తొట్రుపడ్డారు.

బాదురి క్షణం కూడ ఆలస్యం చెయ్యలేదు. పందెపు గుర్రంలా అమాంతం గేటు మీదుగా లోపలకు లంఘించాడు.

"చోర్..... చోర్.... పకడో" ఆ వీధి ప్రతిధ్వనించేలా అరిచాడు, గోడదూకి పారిపోయే ప్రయత్నంలో వున్న ఆ ఇద్దరి మీదకు పులిలా దూకుతూ.

ఒకడితల లాఠీ దెబ్బకు పడేల్ మన్నది. వాడు గావుకేక పెట్టాడుగాని ఆ దెబ్బ వాణ్ణి నిలువరించ లేకపోయింది. క్షణాల్లో ఇద్దరూ గోడదూకి పరారయ్యేరు. బాదురి గోడ దూకబోతున్నంతలో వెనుక అలికిడి వినిపించింది.

గిర్రున వెనుదిరిగాడు. లోపలనుండి ముగ్గురు మనుషులు పరిగెత్తుకువచ్చారు. వాళ్ల నడ్డుకునేందుకు రేసుకుక్కలా వాళ్లమీదకు దూకాడు. ఒకణ్ణి గట్టిగా వాటేసుకున్నాడు. బ్యాటరీలైటు జారి పడిపోయింది.

మిగిలిన ఇద్దరిలో మరొకడు గేటు దూకి పారిపోయాడు. బాదురి కౌగిలిలో చిక్కి గింజుకుంటున్న సహచరుణ్ణి రక్షించటానికి మూడోవాడు బొడ్లోనుంచి కత్తితీసి బాదురిని పొడవనే పొడిచాడు. కత్తిపోటు భుజానికి బలంగా తగిలింది. ఆ బాధతో పట్టు సడలించాడు. దొంగ విదిలించుకొని కాంపౌండ్‌కేసి పరిగెత్తాడు.

ఆ ఇద్దరూ గోడ దూకేంతలోనే బాదురి షాక్‌నుండి తేరుకుని వెంటపడ్డాడు. వాళ్లిద్దరు గోడ దూకారు. ఆ వెంటనే బాదురి కూడా గోడ దూకాడు.

చేతి కందినట్టే అంది పారిపోతున్నారన్న కోపం, ఉక్రోషం బాదురిని మరీ శక్తిమంతుణ్ణి చేశాయి. వాళ్లను వెంబడిస్తూనే లాఠీని గురి చూసి లాఘవంగా కాళ్లమీదకు విసిరాడు.

అంతే! పరుగులో కాస్త వెనకపడ్డవాడి కాళ్లకు లాఠీ అడ్డంపడి మూడుసార్లు పల్టీలు కొట్టాడు. వాడు లేచే ప్రయత్నం చేస్తున్నంతలో వాడి భుజాలను పడిసి పట్టుకుని డొక్కలో మోకాలుతో ఒక్కతాపు తన్నాడు. వాడు గావుకేక పెట్టి, కత్తితీసి బాదురిని పొడిచే ప్రయత్నంలో మీద కురికాడు. బాదురి లాఘవంగా తప్పుకుంటూనే అతని మెడను పట్టుకుని, చేతిబలంతో ముందుకు తోస్తూ నడుంమీద కాలితో విసురుగా తన్నాడు.

బాదురి వ్యూహం ఫలించింది. ఆ విసురుకు అతని తల గోడను బలంగా ఢీకొంది. దొంగ కళ్లు బైర్లు కమ్మాయి. పగిలిన తల నుండి రక్తం పొంగుకు రాసాగింది. కుప్పకూలి పోయాడు.

అయిదు నిమిషాల్లో గొడవంతా జరిగిపోయింది. చుట్టుప్రక్కల ఇళ్లవాళ్లు తలుపులు తీసుకుని బయటికొచ్చారు. అప్పటికే ఎవరో పోలీస్ కంట్రోల్ రూంకి ఫోన్ చేశారు.

బాదురి చేతిగాయం నుండి రక్తం ధారలా కారుతున్నది. ఒకవ్యక్తి గుడ్డతో గాయం మీద బలంగా బిగించి కట్టాడు. బాదురి నిస్సత్తువతో నిలబడలేక పోతున్నాడు. అతడిని వాకిలి మెట్లమీద కూర్చోబెట్టారు.

మరికొద్ది నిమిషాల్లో రెండు పోలీసు పెట్రోల్ వ్యాన్లు వేగంగా దూసుకొచ్చాయి.

ఒక వ్యాన్‌లో బాదురిని, దొంగను హాస్పిటల్‌కు తీసుకెళ్లారు.

ఏ.యస్.పి పరిస్థితినంతా ఆకళింపు చేసుకున్నాడు. విలువైన వస్తువుల కోసం దొంగలు ఇల్లంతా గాలించి చిందరవందర చేసినట్లు కనిపిస్తున్నది. ఐరన్ సేఫ్ పగలగొట్టే ప్రయత్నం జరిగింది. సరైన సమయంలో బాదురి వారిని పసిగట్టడంతో వారి ప్రయత్నం విఫలమైంది.

ఇంటియజమాని ఊరి నుండి తిరిగొచ్చేవరకు తీసుకోవలసిప చర్యల గురించి యస్.ఐతో చర్చించి ఏ.యస్.పి వెళ్లిపోయాడు. పోలీసులు ఆ ఇంటికి కాపలాగా వున్నారు.

ఆ రాత్రంతా పారిపోయిన దొంగలకోసం పోలీసు వ్యానులు గాలిస్తూనే వున్నాయి.

బాదురి చేతికి గాయం బలంగానే అయింది. కుట్లుపడ్డాయి. రక్తం బాగా పోవటంతో హాస్పిటల్‌లోనే వుండాల్సొచ్చింది. దొంగ త్వరలోనే స్పృహలో కొచ్చాడు. ఎన్నో నేరాలతో సంబంధముండి తప్పించుకు తిరుగుతున్న అంతర్ రాష్ట్ర గజదొంగగా పోలీసులు గుర్తించారు.

రెండవరోజు వార్తాపత్రికలన్నీ ఈ వార్తను ఫొటోలతోసహా వివరంగా ప్రచురించాయి. పట్టణంలోని ప్రజలు గూర్ఖా సాహసాన్ని ఎంతగానో మెచ్చుకుంటున్నారు. ఆ వార్తను పేపరు ద్వారా గ్రహించిన వీరభద్రం వెంటనే బయల్దేరివచ్చాడు.

తండ్రి హఠాత్తుగా అనారోగ్యానికి గురైనాడని కబురు రావడంతో అతను వున్న పళంగా కుటుంబంతో బయలుదేరాల్సి వచ్చింది. బస్సు ప్రయాణాలలో కూడా దోపిడీలు జరుగుతున్నాయన్న భయంతో బంగారం, కొంత నగదు ఐరన్ సేఫ్‌లో దాచి ప్రక్క ఇంటివారికి కనిపెట్టి వుండాల్సిందని వెళ్తూ చెప్పాడు.

బాదురి గనుక దొంగతనాన్ని నివారించక పోయివుంటే బంగారం, నగదు కలిపి లక్ష రూపాయిలు దొంగల పాలయ్యేది. వీరభద్రం స్థితిగతులన్నీ దాంతో తలక్రిందులయ్యేవి.

పోలీసులు లాంఛనాలన్నీ పూర్తిచేసి ఇల్లు అతనికి అప్పగించారు. పూచికపుల్ల కూడా ఇంట్లోనుండి పోలేదని వీరభద్రం స్టేట్‌మెంట్ ఇచ్చాడు.

వీరభద్రం బాదురి గురించి వాకబు చేశాడు. అతన్ని పరామర్శించటానికి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు.

బాదురి బెడ్‌మీద పడుకుని ఉన్నాడు. పక్కనే స్టూలుమీద కొడుకు కూర్చున్నాడు. బాదురికి గాయం బాధ బాగానే వున్నట్లుంది. కొద్దిగా మూలుగుతూనే వున్నాడు.

వీరభద్రం బెడ్ దగ్గరకు వెళ్లాడు. అతన్ని చూస్తూనే బాదురి గుర్తించాడు. "సలామ్ సాబ్! ఈరోజే వచ్చారా?" అడిగాడు నీరసంగా.

"ఎలా వుంది నీకు?" అడిగాడు స్టూలు మీద కూర్చుంటూ.

"ఫరవానయి సాబ్! ఘర్‌మే సబ్ కుచ్ ఠీక్ హైనా!" అడిగాడు.

"ఏమీ పోలేదు. నువ్వు గనుక అడ్డుపడకుంటే జీవితంలో నేను కోలుకోలేక పోయేవాడిని. నీ మేలు మర్చిపోలేం" అన్నాడు వీరభద్రం కృతజ్ఞతాపూర్వకంగా.

బాదురి చిర్నవ్వు నవ్వేడు - "సాబ్... నా డ్యూటీ నేను చేశాను. మీలాంటి మారాజులంతా నాకు పైసలిచ్చి ఆదుకుంటున్నది దొంగల్ని పట్టుకోటానికేగా" అన్నాడు మెల్లగా.

అతని కళ్లల్లో తన విధిని సక్రమంగా నిర్వర్తించగలిగానన్న తృప్తి ద్యోతకమవుతోంది.

వారంరోజుల తర్వాత బాదురిని డిశ్చార్జి చేశారు. గాయం ఇంకా పూర్తిగా మానలేదు. మనిషి కోలుకుంటున్నాడు.

పోలీసు ఇంటరాగేషన్‌లో పట్టుబడిన దొంగ తన ముఠా ఆచూకీ చెప్పాడు. పోలీసులు వలపన్ని వివిధ ప్రాంతాలలో దాగిన అతని అనుచరులను పట్టుకున్నారు. దొంగసొత్తు చాల స్వాధీనం అయింది.

పది రోజుల్లో బాదురి బాగానే కోలుకున్నాడు. యథాప్రకారం కాలనీలో రాత్రివేళ అతని లాఠీ చప్పుడు ప్రతిధ్వనించ సాగింది.

నెలదాటింది. మొదటి వారంలో బాదురి డబ్బులకోసం ఇంటింటికీ వెళ్తున్నాడు.

"సలామ్ సాబ్!" అంటూ చేతిలో లాఠీ చంకనుంచుకుని వినమ్రంగా సెల్యూట్ కొడ్తున్నాడు.

డబ్బు వసూలు చేసుకుంటూ త్వరగా సాగి పోతున్నాడు. పదిగంటలయితే ఇంటి యజమానులుండరు. ఆఫీసులకో, వ్యాపారాలకో వెళ్లిపోతారు. ఆ లోగానే సాధ్యమైనన్ని ఎక్కువ ఇళ్లు తిరగాలి.

వీరభద్రం వుంటున్న వీధిలోకి వచ్చాడు. కాని అతని ఇంటిముందు ఆగకుండానే ముందుకు సాగుతున్నాడు.

"గూర్ఖా.... గూర్ఖా...." ఎవరో గట్టిగా పిలిచారు. వెనుదిరిగాడు. వీరభద్రం ఇంటిగేటు ముందు నిలబడి సుమారు పదిహేనేళ్ల అమ్మాయి పిలుస్తోంది.

"క్యా బేటీ" అడిగాడు బాదురి.

"డాడీ పిలుస్తున్నారు. ఇటురా" చెప్పింది. బాదురి వెనుదిరిగి ఆ పిల్లవెంట లోపలికి అడుగు పెట్టాడు.

వీరభద్రం, అతని భార్యా బయటికొచ్చారు.

"గాయం బాగా మానిందా? ఒంట్లో ఎలా వున్నది." వీరభద్రం భార్య పరామర్శించింది.

ఆ దంపతుల ముఖాల్లో బాదురిపట్ల కృతజ్ఞత, గౌరవం తొంగి చూస్తున్నది.

"క్యోం బూలాయా సాబ్..బోలో" అన్నాడు బాదురి చిరునవ్వుతో.

వీరభద్రం జేబులోనుండి అందినంత డబ్బు బయటకు తీశాడు. ఉద్వేగంతో బాదురి చేయి అందుకుని అతని గుప్పిట్లో వుంచాడు.

"ఇది కేవలం మా సంతోషం కొద్దీ ఇస్తున్నాం. తీసుకో" అన్నాడు ప్రాధేయ పూర్వకంగా.

బాదురికి ఆశ్చర్యంతో నోటమాట రాలేదు. చేతిలో వున్న నోట్లకట్ట తీసి చూశాడు. ఇరవైలు, పదులు, రెండ్లు రకరకాల నోట్లు.

"ఏ క్యాహై సాబ్! మేరే హిస్సా దో రూపాయే" అంటూ ఆ దొంతరలో నుండి రెండు రూపాయలు మాత్రం తీసుకొని మిగిలినది వీరభద్రం చేతిలో వుంచాడు.

మరోసారి ఇద్దరికీ వినయంగా తలొంచి వెనుదిరిగి ఠీవిగా గేటుకేసి నడిచివెళ్తున్న అతన్ని చూస్తూ ఆ దంపతులు శిలల్లా వుండిపోయారు.

శిఖరంలా ఎదిగిన బాదురి ఔన్నత్యంముందు గడ్డిపోచలాంటి తన అల్పత్వం, అహంకారం గుర్తుకు వస్తూనే వీరభద్రం సిగ్గుతో కుచించుకుపోయాడు.

"సలామ్ సాబ్.... సలామ్ మేమ్ సాబ్..." వీధిలో వెళ్తున్న బాదురి గొంతు వీరభద్రం మనస్సు పొరలను ఛేదిస్తుంటే అతని కళ్లు చెమ్మగిల్లాయి.

*(విపుల మాసపత్రిక, నవంబర్ 1991)*